www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
అనంతపురము జిల్లా / శ్రీ సత్యసాయి జిల్లా

## ఘనంగా బిసి గళం పోస్టర్లు ఆవిష్కరణ చేసిన వైస్సార్సీపీ నాయకులు మండల కన్వీనర్ గోళ్ళ వాల్మీకి సూరీ







**కళ్యాణదుర్గం,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** కళ్యాణదుర్గంలో బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వైఎస్ఆర్సిపి బీసీ సెల్ తరఫున కళ్యాణదుర్గం సమన్వయకర్త మాజీ ఎంపీ తలారి రంగయ్య ఆదేశాల మేరకు బీసీ గళం పోస్టర్లను విడుదల చేయడం జరిగినది. ఈనెల 26వ తేదీన అనంతపురంలోని లలిత కళా పరిషత్ నందు ఉదయం 10 గంటలకు జరుగు జోన్ బీసీ గళం సదస్సులు జయప్రదం చేయాలని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేంద్ర బీసీ సెల్ జనరల్ సెక్రెటరీ గోగుల పుల్లయ్య బీసీ సెల్ సంయుక్త రాష్ట్ర కార్యదర్శి నవీన్ కుమార్ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి మల్లికార్జున ఉపాధ్యక్షులు కిష్టప్ప కళ్యాణదుర్గం నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు విజయ్ కుమార్ కళ్యాణదుర్గం మండల బీసీ సెల్ అధ్యక్షుడు గోపాల్ కళ్యాణదుర్గం రూరల్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు మోహన్, బ్రహ్మసముద్రం మండల బిసి సెల్ అధ్యక్షుడు బి. మంజు బీసీ గళంపోస్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కళ్యాణ్దుర్గం రూరల్లిమండల కన్వీనర్ గోళ్ళ సూర్యనారాయణ, కళ్యాణదుర్గం ఎంపిపి అంజి,కౌన్సిలర్ తిరుమల వెంకటేశులు, లక్ష్మన్న, కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అధ్యక్షుడు దొడగట్ట మురళి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బిక్కి హరి, మాజీ వర్ఫ్ బోర్డ్ సభ్యుడు షేక్షావలి, జిల్లా పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తాలూకా యూత్ అధ్యక్షులు తలారి చరణ్ ,తాలూక వికలాంగుల విభాగం అధ్యక్షుడు పాత లింగ, జెసిబి రాజేష్ , కురుబ లోకేష్,అనిల్ ,వైస్ కన్వీనర్ కురుబ మల్లీ, చిరు, ప్రేమ్, వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఒలంపియాడ్ లో అనంతపురం జోన్ శ్రీ చైతన్య విద్యార్థుల సత్తా



**అనంతపురం,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** అనంతపురం జోన్ కి చెందిన శ్రీ చైతన్య విద్యార్థులు ఐ ఎన్ టి ఎస్ ఓ ఫైనల్ లెవెల్ ఒలంపియాడ్ పోటీలలో 13 గ్రాండ్ ప్రైజులతో రాష్ట్రస్థాయిలోనే అగ్రస్థానం ఆక్రమించారని అనంతపురం జోన్ శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి తెలియజేశారు. స్థానిక కమ్మ భవన్ సమీపంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై, ఐఎన్ టిఎస్ఓ తుది లెవెల్ ఫలితాలలో గ్రాండ్ ప్రైజ్ కింద 13 మంది విద్యార్థులకు లాప్ టాప్ లను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ల్యాప్ ట్యాపులను అందుకున్న విద్యార్థులు వరుసగా కమ్మ భవన్ దగ్గర ఉన్న శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి రఘువీర్, కోర్టు రోడ్డు శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన ఐదవ తరగతి విద్యార్థి వైష్ణవి, కక్కలపల్లి దగ్గర ఉన్న శ్రీ చైతన్య బాలుర పాఠశాలకు చెందిన ఆరవ తరగతి విద్యార్థి నవనీత్, హౌసింగ్ బోర్డు శ్రీ చైతన్య బాలికల పాఠశాలకు చెందిన ఏడవ తరగతి విద్యార్థి జోష్ణవి, ఆర్టీసీ బస్టాండ్ దగ్గర గల శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థి జోష్మిత, సీబీఎస్ఈ పాములాయ్ బ్రాంచ్ కు చెందిన ఏడవ తరగతి విద్యార్థి ఉదయ్ కుమార్ మరియు మూడవ తరగతి విద్యార్థి రిత్విక్, తాడిపత్రి శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన ఆరవ తరగతి విద్యార్థి హిరణ్యకృతి, హిందూపురం శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి మోక్షజ్ఞ, కళ్యాణదుర్గం శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన ఐదవ తరగతి విద్యార్థి దర్శన్, గుంతకల్ శ్రీ చైతన్య పాఠశాల ఒకటవ బ్రాంచ్ కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి కార్తీక్, గుంతకల్లు శ్రీ చైతన్య పాఠశాల రెండవ బ్రాంచ్ కు చెందిన 8వ తరగతి విద్యార్థి ప్రిత్విక్ సరోజ్, గుంతకల్లు శ్రీ చైతన్య పాఠశాల మూడవ బ్రాంచ్ కు చెందిన ఆరవ తరగతి విద్యార్థి ప్రియాంషా సత్య ప్రజ్ఞ బెహరా ఉన్నారు. అనంతరం ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. శ్రీ చైతన్య మేనేజ్మెంట్ రూపొందించిన పటిష్టమైన పాఠ్యప్రణాళిక, అత్యంత నిష్ణాతులైన మరియు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో శిక్షణ ఇవ్వడం, ఇంతటి అత్యద్భుతమైన విజయం సాధ్యమైనదని అన్నారు. ఇందుకు సహకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, బహుమతులు పొందిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్స్, అకడమిక్ కోఆర్డినేటర్లు, అకడమిక్ డీన్లు, ఇన్చార్జిలు, ప్రైమరీ ఇన్చార్జులు, ఒలంపియాడ్ పరీక్షల ఇన్చార్జులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ప్రత్యేకంగా చొరవ చూపాలి

- రైతులు ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు
- అధికారులకు సూచించిన ధర్మవరం టీడీపీ ఇన్ఛార్జి పరిటాల శ్రీరామ్
- రామగిరిలో రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం - ప్రజల నుంచి అర్జీల స్వీకరణ
- రైతులతో నేరుగా సమస్యలు అడిగి తెలుసుకున్న జేసీ మౌర్య భరద్వాజ్





**రామగిరి,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని.. వాటి పరిష్కారంలో ప్రత్యేకంగా చొరవ చూపాలని రెవెన్యూ అధికారులకు ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ సూచించారు. రామగిరి మండల కేంద్రంలోని పంచాయతీ రాజ్ అతిథి గృహంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ మౌర భరద్వాజ్ తో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాలకు సంబంధించి నిర్వహించిన ఈ రెవెన్యూ క్లీనిక్ కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. పరిటాల శ్రీరామ్ తో పాటు జాయింట్ కలెక్టర్ రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపించాలని శ్రీరామ్ జాయింట్ కలెక్టర్ ని కోరగా.. ఆయన ఆ దిశగా ఆదేశాలు జారీ చేశారు. మరికొన్ని సమస్యలకు నిర్దేశిత సమయంలో పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు. రామగిరి నుంచి 100, కనగానపల్లి నుంచి 40, చెన్నేకొత్తపల్లి నుంచి 14అర్జీలు ఈ కార్యక్రమంలో స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ భూసమస్యలపై ఎంతో మంది రైతులు సుదీర్ఘ కాలం పాటు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఇందులో కొందరు అధికారులు సరిగా పట్టించుకోకపోవడం ఒక కారణమైతే.. మరికొన్ని చోట్ల రైతులు పంతానికి పోవడం మరో సమస్యగా ఉందన్నారు. కేవలం కొంత భూమి విషయంలో ఏర్పడిన వివాదానికి మొత్తం భూమిని సాగు చేయకుండా వదిలేసిన సంఘటనలు కూడా చూస్తున్నామన్నారు. కొంత మేర రాజీ మార్గంలో వెళ్తే.. చాలా సమస్యలకు పరిష్కారం ఉంటుందన్నారు. మరికొన్నింటికి రీ సర్వే చేయాల్సిన అవసరం ఉందని.. అధికారుల పరంగా చర్యలు తీసుకోవాల్సినవి ఉన్నాయని.. అందుకే ప్రభుత్వం రెవెన్యూ క్లీనిక్ లను ఏర్పాటు చేసిందన్నారు. ఇక్కడికి వచ్చిన అర్జీలకు కచ్చితమైన పరిష్కారం చూపిస్తారని.. అలా చూపని పక్షంలో ఎందుకు సమస్య పెండింగ్ లో ఉందన్నది కూడా వివరణ ఇస్తారని స్పష్టం చేశారు. భూ సమస్యలు లేకుండా చేయాలనే మంచి ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని శ్రీరామ్ అన్నారు.

## రాయల సీమకు నీళ్లు - నిధుల కోసం చావో రేవో' పోరాడుదాం : మాజీ ఎంపీ తలారి రంగయ్య

- త్రిబుల్ ఇంజన్ సర్కార్‌కు సీమపై మనసు లేదు
- ఎయిమ్స్, హైకోర్టులను తరలించుకుపోయి ద్రోహం చేశారు







**కళ్యాణదుర్గం,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** మన రాయలసీమ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయంపై మాజీ ఎంపీ తలారి రంగయ్య నిప్పులు చెరిగారు. నంద్యాల వేదికగా జరిగిన 'రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల సమాలోచన సభ'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సాకే శైలజనాథ్, కాకాని గోవర్ధన్ రెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా కార్యక్రమం ను ఉద్దేశించి మాజీ పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య మాట్లాడుతూ రాయలసీమ రత్నాల సీమ పేరుగొన్న ప్రాంతం అలాంటిది ఈరోజు మన పరిస్థితి రాయలసీమ నీళ్లు, నిధులు మరియు ఆత్మగౌరవం కోసం పార్టీలకు అతీతంగా ప్రతి రాయలసీమ బిడ్డ రోడ్డెక్కాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పిలుపునిచ్చారు.మహాత్మా గాంధీ నాడు స్వాతంత్రం కోసం పిలుపునిచ్చిన 'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తిని, 'డూ ఆర్ డై' (చావో రేవో) నినాదాన్ని మనం స్మరించుకోవాలని రంగయ్య అన్నారు." నీళ్లు, నిధులు దక్కాలంటే మరోసారి అదే స్థాయి పోరాటం చేయాలని ఆయన ఉద్వేగభరితంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న త్రిబుల్ ఇంజన్ సర్కార్‌కు రాయలసీమ అభివృద్ధిపై ఏమాత్రం మనసు లేదని ఆయన విమర్శించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని, సీమ ప్రాజెక్టులను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఈ ప్రాంతానికి తలమానికంగా ఉండాల్సిన ఎయిమ్స్ (AIIMS) ను మంగళగిరికి తరలించుకుపోయారని, అలాగే రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన హైకోర్టును కూడా ఇక్కడి నుంచి తరలించి ఈ ప్రాంతానికి తీరని ద్రోహం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సీమ సంపదను, సంస్థలను దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు."రాయలసీమకు నీళ్లు రావాలన్నా, నిధులు దక్కాలన్నా రాజకీయాలకు అతీతంగా అందరం ఏకమై మన హక్కుల కోసం రోడ్డెక్కి పోరాడదామని రంగయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, రైతులు, మేధావులు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు మరణం దిగ్భ్రాంతికి గురిచేసింది ఎమ్మెల్యే సురేంద్ర బాబు





**కళ్యాణదుర్గం,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేబినెట్ మంత్రి నాదెండ్ల భాస్కరరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రజాసేవ పట్ల అంకితభావంతో, దీర్ఘకాలం రాజకీయ రంగంలో విశిష్ట సేవలు అందించిన ఆయన ఒక ప్రఖ్యాత ప్రజానాయకుడు.ముఖ్యమంత్రిగా, కేబినెట్ మంత్రిగా ఆయన తీసుకున్న పరిపాలనా నిర్ణయాలు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడ్డాయి. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడిగా ఆయన చిరస్మరణీయులు.మాజీ ముఖ్య మంత్రి నాదెండ్ల భాస్కరరావు మరణం రాష్ట్రానికి, రాజకీయ రంగానికి తీరని లోటు. ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబ సభ్యులకు, అనుచరులకు నా హృదయపూర్వక సానుభూతి తెలియజేస్తూ, వారికి భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను.

## పామిడికి 24న భక్త తుకారాం గురుపరంపరస్వామి రాక





**పామిడి,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** పామిడి పట్టణానికి మహారాష్ట్ర పండరీపురం భక్తతుకారాం గురుపరంపర చైతన్య సద్గురు గోపాల్ వాస్కార్ మహారాజ్ ఈనెల 24వతేది శుక్రవారం విచ్చేస్తున్నట్లు విఠోభ దేవాలయ కమిటీ సభ్యులు జోజోడే కుమార్ తెలిపారు.అయన ఆరు రోజుల పాటు భావసారాక్షత్రియసమాజ్ సభ్యులను,భక్తులకు, అనుగ్రహ భాషణ చేస్తారు . పాండురంగస్వామి భక్తడు జ్ఞానదేవ్ మహారాజ్ విరచిత జ్ఞానేశ్వరి (మరాఠి భగవద్గిత)పారాయణ సప్తాహం పెద్ద విటోభ దేవాలయంలో నిర్వహిస్తారు.రోజూ కీర్తనలు, ప్రవచనాలు, భజనలు కొనసాగిస్తారు. ఉదయం, మధ్యాహ్నం,రాత్రి నిర్వాహకులు అన్నప్రసాద వినియోగం గావిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.

## గుంతకల్ సిపిఎం పార్టీ సీనియర్ నాయకుడు డి.శ్రీనివాసులు మృతి




**పామిడి,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** గుంతకల్ పట్టణంలోని సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు డి శ్రీనివాసులు అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రి యందు చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఇతని జన్మస్థలం పామిడి మండలంలోని సొరకాయలపేట గ్రామంలో జన్మించాడు.విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు అనుబంధ సంస్థలలో సంఘాలలో జీవించాడు. దాదాపు 35 సంవత్సరాలుగా జీవితమంతా సిపిఎం పార్టీలో నిరుపేదల సమస్యల పట్ల పోరాటాలు చేసిన నాయకుడు గుంతకల్ పట్టణంలో సిపిఎం పార్టీ కార్యాలయాన్ని నిర్మించడంలో ప్రధాన భూమిక వహించాడు. ఇతని మృతి పార్టీకి తీరని లోటని, పామిడి మండలం సిపిఎం పార్టీ సీనియర్ నాయకుడు అనిమిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లేష్, మరియు ముత్యాలు, చంద్రమోహన్ రెడ్డి, శివ తదితరులు ప్రగాఢ నివాళులర్పించారు. అతని జన్మస్థలమైన పామిడి మండలంలోని సొరకాయల పేట గ్రామంలో నేడు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

## ఊరి దేవర కార్యక్రమంలో పాల్గొన్న యువనేత గుమ్మనూరు ఈశ్వర్





**గుంతకల్,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** ప్రతినిధి గుమ్మనూరు హరి గుత్తి మండలం పెద్దొడ్డి గ్రామస్తుల మరియు కూటమి నాయకుల ప్రత్యేక ఆహ్వానం మేరకు పెద్దొడ్డి గ్రామం నందు పెద్దమ్మ ఉరిదేవర కార్యక్రమంలో పాల్గొని పెద్దమ్మ తల్లికి పూజా కార్యక్రమం నిర్వహించి గ్రామస్తుల ఆతిథ్యాన్ని స్వీకరించిన గుంతకల్ నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు యువనేత గుత్తి మరియు పామిడి టిడిపి ఇన్చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ఈ సందర్భంగా గ్రామస్తులు గుమ్మనూరు ఈశ్వర్ కి శాలువా కప్పి గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలకడం జరిగింది. అనంతరం గుమ్మనూరు ఈశ్వర్ గ్రామంలో పెద్దమ్మ తల్లికి ఆరతి తీసుకొని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు అలాగే వర్షాలు బాగా పడి పంటలు బాగా పండి ప్రజలందరూ మరియు రైతులు అందరూ బాగుండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తల ఇంటింటికి వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణ మరియు మండల కూటమి నాయకులు మరియు కార్యకర్తలు మరియు పెద్దొడ్డి గ్రామస్తులు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## గుంతకల్లు పురపాలక సంఘములో తాగునీటి సరఫరా సమస్యలపై ప్రత్యేక అధికారి ఎ.బి.వి.ఎస్.బి శ్రీనివాసులు






**గుంతకల్,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** ప్రతినిధి గుమ్మనూరు హరి గుంతకల్ పట్టణం పురపాలక సంఘంలో తాగునీటి సమస్యలపై ప్రత్యేక సమావేశం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి పట్టణంలోని నీటి సరఫరా పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు.ప్రత్యేక అధికారి మాట్లాడుతూ గుంతకల్ పట్టణంలోని అన్ని వార్డుల్లో తాగునీటి సరఫరా సమస్యలను వెంటనే గుర్తించి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి సరఫరా టర్న్‌కాక్ సిబ్బందితో కూడా ప్రత్యేకంగా మాట్లాడి, సరఫరా సమయంలో ఎదురవుతున్న సమస్యలు, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై చర్చించారు. అన్ని వార్డుల్లో నీటి సరఫరా అంతరాయం ఉన్న హాట్‌స్పాట్ ప్రాంతాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ప్రజలకి నీటి సమస్యలు గురించి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలని చెప్పారు ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇంతియాజ్ అలీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సుమ, షబానా, అసిస్టెంట్ ఇంజనీర్లు హరికృష్ణ, ప్రతాప్, సుదర్శన్ మరియు సీనియర్ అసిస్టెంట్ రాము పాల్గొన్నారు.

## గుంతకల్ పట్టణంలో అంజుమన్ కమిటీ ఏర్పాటు




**గుంతకల్, ఏప్రిల్22.అక్షర టైమ్స్:** పతినిధి గుమ్మనూరు హరి గుంతకల్ పట్టణ అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా పవిత్ర మక్కా యాత్రకు గుంతకల్ నుండి వేళ్ళు వారికి అక్కడ పాటించ వలసిన నియమ నిబంధనలు మరియు జాగ్రత్తల గురించి తర్ఫీదు తో పాటు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.అంజుమన్ అధ్యక్షులు సయ్యద్ జాఫర్ సాబ్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత పెద్ద ఎత్తున వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గుంతకల్ పట్టణ ఖాజీలు రజాక్ పీర్ సాహెబ్, సయ్యద్ సత్తార్ సాబ్ మరియు ఇస్మాయిల్ అఫీజ్ సాబ్, ఖలీల్ ఆఫీస్ సాబ్, మరియు కమిటీ సభ్యులు కె. వలి భాష, షాషావలి,ఆర్డిజీ భాష, జలీల్ సాబ్, అఫ్రోజ్ఖాన్, అషారాఫ్, ఇతర మసీదు పెద్దలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన యువనేత గుమ్మనూరు ఈశ్వర్



**పామిడి,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** పామిడి మండలంలోని వంకరాజుకాల్వ గ్రామానికి చెందిన పెద్దయ్య ఆహ్వానం మేరకు ఆయన తమ్ముడు వివాహానికి వంకరాజుకాలవ గ్రామం నందు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన గుంతకల్ నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు యువనేత పామిడి మరియు గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ఈ కార్యక్రమం లో పామిడి పట్టణ మరియు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఊరి దేవర కార్యక్రమానికి హాజరైన కాపు రామచంద్రారెడ్డి



**గుమ్మగట్ట,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** గుమ్మగట్ట మండలం బేలోడు గ్రామం నందు మిత్రులు మరియు కుటుంబ సభ్యులతో కలిసి ఊరిదేవరలో పాల్గొన్న రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు కాపు రామచంద్రారెడ్డిదంపతులు బేలోడు గ్రామం నందు శివారెడ్డి వారి ఆహ్వానం మేరకు 47 సంవత్సరాలు తర్వాత జరిగిన ఊరిదేవరలో మిత్రులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గుమ్మగట్ట మాజీ జడ్పీటీసీ మహేష్ , బొమ్మనహాల్ మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి , ప్రశాంత్ , బిజెపి నాయకులు బోర్వెల్ నాగిరెడ్డి , కుమార్ రెడ్డి మరియు మిత్రులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట..

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ కాలవ



**గుమ్మగట్ట,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** గుమ్మగట్ట మండలం బిటి ప్రాజెక్ట్ గ్రామంలో శ్రీ శ్రీ అంజినేయస్వామి నూతన దేవాలయము మరియు విగ్రహ పున:ప్రతిష్ఠ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాయదుర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు నూతన ఆలయాన్ని సందర్శించన అనంతరం ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు తీసుకొన్నారు .అనంతరం బిటిపి గ్రామ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులకు ఆలయ అభివృద్ధి కొరకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు 50,000/- రూపాయలు విరాళంగా అందించారు.భవిష్యత్తు లో ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలుఅందిస్తామనితెలియజేశారు .ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ కాలువ సన్నన్న, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి మాజీ కన్వీనర్ గిరిమల్లప్ప, మాజీ సర్పంచ్ హనుమంత రెడ్డి బిటిపి మూర్తి, ఎస్సి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చిన్నకృష్ణ, అధికార ప్రతినిధి అంజి,బెస్త సూరి చైర్మన్ రాజు పైదొడ్డి రాజు, శివరాజు,కుమారస్వామి, శర్మన్ గ్రామ నాయకులు భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనే ధ్యేయం

### ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ ఆర్.ఓం ప్రసాద్





**ధర్మవరం,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** మాదకద్రవ్యాల నిర్మూలనే మా ధ్యేయము అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంయుక్త ధర్మవరం నియోజకవర్గం ఇంచార్జ్ ఆర్ ఓం ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలన ధ్యేయంగా వైబ్రెంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్ , ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. స్థానిక మున్సిపల్ బాలుర పాఠశాలలో మాదకద్రవ్యాల వల్ల జరిగే అనర్థాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వైబ్రెంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్ మాదకద్రవ్యాల నిర్మూలనకై ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో , ఉమ్మడి అనంతపురం జిల్లాలో 10 నియోజకవర్గాల్లో 100 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శిస్తూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు అందులో భాగంగా వైబ్రెంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు విజయ్ కలాం తిరుపతి నుంచి విశాఖపట్నం వరకు 1000 కిలోమీటర్లు సైకిల్ యాత్ర నిర్వహించి వివిధ యూనివర్సిటీలలో , కళాశాలలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ధర్మవరం మండల విద్యాశాఖ అధికారి గోపాల్ నాయక్, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, వైబ్రెంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్ ప్రతినిధి ఓం ప్రసాద్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సిబ్బందికి లంచం ఇవ్వరాదు

### విద్యుత్ డివిజన్-1 ఏఈ వి.నాగభూషణం



**ధర్మవరం,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** పట్టణంలోని డివిజన్ ఒకటిలో పనిచేసే సిబ్బందికి విద్యుత్ సమస్యలపై ఎటువంటి లంచము ఇవ్వరాదని విద్యుత్ డివిజన్-1 ఏఈ వి. నాగభూషణం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా డివిజన్ పరిధిలో నూతన విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నిమిత్తం నియమ నిబంధనల ప్రకారం మీసేవ లేదా సచివాలయములలో ఆన్లైన్ ద్వారా అప్లై చేసుకోవాలని, తదుపరి ఆన్లైన్ రసీదును విద్యుత్ కార్యాలయంలో ఇచ్చినచో సకాలంలో నూతన మీటర్ విద్యుత్ కనెక్షన్ ఇవ్వబడుతుందని తెలిపారు. ఇటువంటి విషయాలలో దళారులు గాని మా విద్యుత్ సిబ్బందికి కానీ ఎటువంటి లంచం ఇవ్వరాదని, అలా ఎవరైనా అడిగినచో నా సెల్ నెంబర్ 9440813256 కు ఫోను చేయాలని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని తెలిపారు.

# ప్రతి అధికారి విజనరీలా పనిచేయాలి

### ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



**రాయదుర్గం,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** ప్రజల జీవన ప్రమాణాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని, అందుకోసం ప్రతి అధికారి ఒక విజనరీలా (దూరదృష్టితో) పనిచేయాలని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం రాయదుర్గం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన "స్వర్ణ రాయదుర్గం విజన్ 2047" యాక్షన్ ప్లాన్ గురించి అధికారులతో చర్చించారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం కేవలం వర్తమానం గురించి కాకుండా, రాబోయే పాతికేళ్ల కాలంలో ప్రజల జీవన ప్రమాణాలు ఏ విధంగా ఉండాలో ఆలోచించాలని సూచించారు. ప్రజల ఆశలకు అనుగుణంగా ఏయే రంగాల్లో ఎలాంటి పురోగతి సాధించాలో స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే లక్ష్యాలను చేరుకోగలమన్నారు. భవిష్యత్తు అవసరాలపై సమగ్ర ప్రణాళికను రూపొందించుకుని, వాటి సాధనకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందిన రాష్ట్రంగా గుర్తింపు పొందాలంటే ఇలాంటి పక్కా ప్రణాళికలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలు మరే ఇతర రాష్ట్రంలోనూ లేవని, పేదరికం లేని సమాజం ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని వివరించారు. అయితే, కేవలం సంక్షేమానికే పరిమితం కాకుండా అభివృద్ధిలోనూ సమతుల్యత పాటించినప్పుడే సమగ్ర లక్ష్యాలను సాధించగలమన్నారు. వివిధ పథకాల ద్వారా అందుతున్న నిధులను, మన ప్రయత్నం ద్వారా నియోజకవర్గానికి తీసుకొచ్చే అదనపు నిధులనుసమర్థవంతంగాసద్వినియోగం చేసుకునేలా ప్రతి శాఖ సిద్ధంగా ఉండాలని సూచించారు. ?రాష్ట్ర స్థాయిలో ప్రస్తుతం రాయదుర్గం నియోజకవర్గం 32వ స్థానంలో ఉందని, దీనిని కనీసం 10వ స్థానంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రతి శాఖాధికారి తమ పరిధిలో ఏం చేయాలి, ఎక్కడ వెనుకబాటు ఉంది, దానిని ఎలా అధిగమించాలి, అనే విషయాలపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం వల్ల లక్ష్య సాధన కష్టతరమవుతోందని, దానిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజల సమస్యలు తీరుస్తారనే నమ్మకంతో తమను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకున్నారని, అదే విధంగా బాధ్యతాయుతంగా పనిచేస్తారనే నమ్మకంతో ప్రభుత్వం అధికారులను నియమించిందని గుర్తు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సంపూర్ణ సహకారంతోనే 'అభివృద్ధి చెందిన రాయదుర్గం' సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ ఉజ్వల భవిష్యత్తు కోసం పునరంకితం కావాలని కాలవ శ్రీనివాసులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వోలు, ఎంపీడీఓలు, ఆర్ డబ్లి యుఅధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పామిడిలో ఈనెల ఈనెల 27 నుండి 29వ వరకు భోగేశ్వరస్వామి పునఃప్రతిష్ఠ కార్యక్రమం





**పామిడి,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** మండల కేంద్రమైన పామిడి పట్టణంలో ఎంతో చరిత్ర కలిగిన చోళరాజుల కాలంలో వెలసిన ప్రసన్న పార్వతి భోగేశ్వరస్వామి ఆలయమును నిర్మించబడినది. ఆ పురాతన దేవాలయంను రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జీర్ణోద్ధరణ గావింపబడి పునర్నిర్మాణం గావింపబడినది. ఎంతో విశిష్టత చరిత్ర కలిగిన ఈ క్షేత్రంలో శ్రీ పార్వతిభోగేశ్వరస్వామి వార్ల పునఃప్రతిష్ట మరియు నూతన శిఖర,ధ్వజప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవములు ఈనెల 27 నుంచి 29 వరకు అత్యంత వైభవోపేతంగా, శ్రీ సద్గురు విద్యారణ్య భారతి స్వామీజీ (హంపి పీఠం) వారి అనుగ్రహంతో పంచశతాధిక ప్రతిష్టాచార్యులు బ్రహ్మశ్రీ పుల్లేటికుర్తి గణపతి శర్మ, దేవగుడి సురేష్ శర్మ వారి బృందం ఆలయ అర్చకులు రామేశ్వర శర్మ చంద్రమౌళి వారి సమక్షంలో 27న 9 గంటలకు వేద పారాయణం గోపూజ ఆలయ ప్రదర్శనలు ప్రవేశభలి, భూతభలి, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, దీక్షారాధన, అఖండ స్థాపన, అష్ట దేవతారాధన, నవకలశ స్థాపన, తీర్థ ప్రసాద వితరణ, 28న వాస్తు పూజ, వాస్తు హోమం, వాస్తు బలి, సముద్ర జలాలతో స్నపణం, వేద స్వస్తి, మంత్రపుష్పములు తీర్థ ప్రసాద వితరణ, 29న, గణపతి పూజ పంచగవ్యం ఉదయం 10:40 కి హస్తా నక్షత్రం మిధున లగ్న నందు భోగేశ్వర స్వామి పునః ప్రతిష్ట, శిఖర జీవద్వజ యంత్ర ప్రతిష్ట నూతన శిఖర ధ్వజస్తంభ స్థాపనలు తదితర కార్యక్రమాలు సద్గురు విద్యారణ్య భారతి స్వామీజీ కరకమలములచే కుంభాభిషేకం గోపృష్టి మహా నైవేద్యం, మహా పూర్ణాహుతి అగ్ని ఉద్వాసన తదనంతరం 12 గంటలకు శ్రీ ప్రసన్న పార్వతి సమేత భోగేశ్వరస్వామి వార్ల శాంతి కళ్యాణ మహోత్సవం అవబృందం మహాదాశీర్వచనం పండిత సత్కారములు అత్యంత వైభవోపేతంగా త్రయాహ్నిక దీక్షతో శైవాగమోక్త ప్రకారముగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, దైవ కార్యక్రమాల్లో అశేషభక్తాదులు పాల్గొని భోగేశ్వర స్వామి కృపకు పాత్రులు కావలసిందిగా దేవాలయ కార్యనిర్వాహణాధికారి అంగదాల క్రిష్టయ్య,దేవాలయ కమిటీ చైర్మన్ పోలేపల్లి భారతి, ఆమెభర్త పిఆర్ కె బాబు, ప్రధాన అర్చకులు రామేశ్వరశర్మ చంద్రమౌళి, అనిల్ కుమార్,మరియు ఆలయ కమిటీ సభ్యు లు, భక్తులు తదితరులు పాల్గొని తెలిపారు.

## దేశ ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు తగవు ఖర్గే వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి


- ప్రధాని మోదీని ఉగ్రవాదితో పోల్చడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం
- బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమల ప్రకాష్ నాయుడు



**ముదిగుబ్బ,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్రంగా ఖండనీయమని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా సత్యసాయి జిల్లా అధ్యక్షుడు సోమల ప్రకాష్ నాయుడు పేర్కొన్నారు. ప్రధాని మోదీని ఉగ్రవాదితో పోల్చడం సిగ్గుచేటు చర్య మాత్రమే కాకుండా, కాంగ్రెస్ పార్టీ రాజకీయ సంస్కారం ఎంత దిగజారిపోయిందో చూపిస్తోందని అన్నారు. పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో రాజకీయ విభేదాలు సహజమని, ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేయడం ప్రతి ప్రతిపక్ష పార్టీ హక్కేనని అన్నారు. అయితే దేశ ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రధానమంత్రి స్థాయిలో ఉన్న నాయకుడిపై వ్యక్తిగత విమర్శలు, అవమానకర పదజాలం ఉపయోగించడం బాధ్యతారాహిత్య రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుండగా, ప్రజల్లో ఆదరణ కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఇలాంటి చౌకబారు విమర్శలకు దిగజారడం దురదృష్టకరమని విమర్శించారు. దేశ భద్రత, రైతుల సంక్షేమం, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ప్రధాని మోదీ విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. అలాంటి నాయకుడిని ఉగ్రవాదితో పోల్చడం కోట్లాది భారతీయుల మనోభావాలను దెబ్బతీసే చర్య అని అన్నారు. మల్లికార్జున ఖర్గే వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కూడా ఇలాంటి బాధ్యతారాహిత్య వ్యాఖ్యలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పసుపులేటి వెంకటేష్, సోషల్ మీడియా కన్వీనర్ పీవీ శివకుమార్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు దేశ నారాయణ, గంగులప్ప తదితర నాయకులు పాల్గొన్నారు.

# ధర్మవరంలో దొరకని గ్యాస్ బండ

- ఒకే సిలిండర్ ఉన్న వారి పరిస్థితి దుర్భరం
- మాడు పగిలే మండుటెండ - అష్ట కష్టాలలో అర్ధాంగి
- 45 రోజుల నిరీక్షణ తర్వాత కూడా దొరకని గ్యాస్ బండ.
- ఏజెన్సీ పై తిరగబడ్డ ప్రజలు - నిర్లక్ష్యపు సమాధానంతో నెట్టుకొస్తున్న ఏజెన్సీ
- ధర్మవరం గ్యాస్ కష్టాలు - బాధ్యత ఎవరిది? - పరిష్కారం ఎప్పుడు?







**ధర్మవరం,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** ధర్మవరం పరిసర ప్రాంతాల్లో ఉన్న "అమరావతి హెచ్పీ గ్యాస్ ఏజెన్సీ" పరిధిలో ప్రస్తుతం ఏర్పడిన గ్యాస్ కొరత పరిస్థితి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. గత నలభై ఐదు రోజులుగా అనేక గ్రామాల్లో గ్యాస్ సిలిండర్లు అందకపోవడం ఒక పెద్ద సమస్యగా మారింది. పల్లెల్లో జీవిస్తున్న సాధారణ ప్రజల రోజువారీ జీవితం పూర్తిగా గ్యాస్ మీద ఆధారపడి ఉంటుంది. అలాంటి పరిస్థితిలో ఈ స్థాయి కొరత ఉండటం అనేది ఆందోళన కలిగించే విషయం.ముఖ్యంగా వృద్ధులు, శారీరక సమస్యలతో బాధపడుతున్న వారు, ఇంట్లో చిన్న పిల్లలు ఉన్న కుటుంబాలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది మళ్లీ పాత పద్ధతులకు వెళ్లి కట్టెలు, చెత్తతో వంట చేయాల్సి వస్తోంది. దీనివల్ల ఆరోగ్య సమస్యలు, సమయ నష్టం, అదనపు కష్టం.మహిళలపై ఈ భారం మరింత ఎక్కువగా పడుతోంది.ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఒకవైపు ప్రభుత్వం గ్యాస్ సరఫరా విషయంలో ఎటువంటి కొరత లేదని చెబుతుంటే, మరోవైపు గ్రౌండ్ లెవెల్లో ప్రజలు 45 రోజులుగా సిలిండర్ కోసం ఎదురు చూస్తున్నారు. ఇది నిజంగా పరస్పర విరుద్ధమైన పరిస్థితి. ఇక్కడ ప్రశ్నలు తలెత్తుతున్నాయి ప్రభుత్వం చెప్పేది నిజమా? లేక స్థానిక స్థాయిలో అధికారులు పట్టించుకోవడంలేదా? లేదా ఏజెన్సీ నిర్వహణలో లోపాలున్నాయా గ్యాస్ కంపెనీలు, ప్రజలకు నమ్మకమైన సేవలు అందించాల్సిన బాధ్యత కలిగి ఉన్నాయి. అయితే ఇలాంటి పరిస్థితులు కొనసాగితే ఆ నమ్మకం దెబ్బతింటుంది. అలాగే స్థానిక అధికార యంత్రాంగం కూడా ఈ సమస్యను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలి.ప్రస్తుతం ఉన్న పరిస్థితి కొనసాగితే, ఇది కేవలం ప్రజల ఇబ్బందులకే పరిమితం కాదు--- ఇది ప్రభుత్వ ప్రతిష్టపై కూడా ప్రభావం చూపిస్తుంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్లో ఉన్న కూటమి ప్రభుత్వానికి ఇది ఒక నెగటివ్ సిగ్నల్గా మారే ప్రమాదం ఉంది. ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి, స్పందించకపోతే ప్రజలలో అసంతృప్తి పెరుగుతుంది.అందువల్ల, సంబంధిత అధికారులు, గ్యాస్ కంపెనీ అధికారులు, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పెండింగ్లో ఉన్న సిలిండర్ల సరఫరాను వేగవంతం చేయాలి. అవసరమైతే ప్రత్యేక చర్యలు తీసుకుని గ్రామాల వారీగా సరఫరా ప్రణాళిక రూపొందించాలి. ప్రజల కష్టాలు తగ్గించడమే కాకుండా, ప్రభుత్వంపై ఉన్న నమ్మకాన్ని కూడా నిలబెట్టాలి.ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యకు త్వరితగతిన పరిష్కారం కనుగొనడం ఇప్పుడు అత్యవసరం. ఇది కేవలం ఒక గ్యాస్ సమస్య కాదు--- ప్రజల జీవన ప్రమాణాలకు సంబంధించిన అంశం. అధికారులు వెంటనే స్పందిస్తారా? లేక ప్రజల బాధలు ఇంకా కొనసాగుతాయా? అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన సమయం వచ్చింది.



## తాడిమర్రి లో పోషణ పక్వాడ

**తాడిమర్రి,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** గర్భవతులు పిల్లల తల్లులు తీసుకొని ఆహారంపైనే పిల్లలు ఆరోగ్యం నిలకడగా ఉంటుందని ఐసిడిఎస్ సిడిపిఓ సరస్వతి అన్నారు,కరబ కాలనీలోని గంగమ్మ గుడి వద్ద ఉన్న అంగన్వాడి సెంటర్ లో పోషణ పక్కోడ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా అంగన్వాడి సెంటర్ కు వచ్చిన గర్భవతులు పిల్లలతలను ఉద్దేశించి సిడిపిఓ మాట్లాడుతూ జింక్ ఫుడ్ తీసుకోవడం ప్రభావంచెడు గా ఉంటుందన్నారు సూపర్వైజర్లు లలితమ్మ దేవమణి చంద్రమ్మ మాట్లాడుతూ బాలింతలు గర్భవతులు తల్లి పిల్లలు కు ఎనిమిదో తారీకు నుంచి ఈ నెల 24వ తేదీ వరకు పోషణ పక్కోడ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు ఆట ఆధారిత విద్య మూడు సంవత్సరాలు నుంచి ఆరు సంవత్సరాల వరకు ఉంటుందని ఆ సమయంలో చిన్నపిల్లల మెదడు చురుకుగా పనిచేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో చిన్నపిల్లలు తల్లిదండ్రులు గర్భవతులు బాలింతలు పాల్గొన్నారు,

# అంగన్వాడి కేంద్రాలు ఆరోగ్య కేంద్రంలు

**- సముతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం**

**- ఏ సిడిపిఓ రెడ్డి రమణమ్మ,సూపర్వైజర్ గంగాదేవి**

**ఆమడగూరు,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** మండల కేంద్రంలోని 2అంగన్వాడి కేంద్రంలో, ఏ సిడిపిఓ రెడ్డి రమణమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ గంగాదేవి ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పోషణ పక్కవాడ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు , గర్భిణీ స్త్రీలు, బాలింతలు టెలివిజన్, సెల్ ఫోన్లు ఎక్కువగా వినియోగించడం వల్ల అనారోగ్యాలకు గురవుతరని, వాటి వల్ల ఎన్నో అనార్థాలకు దారి తీస్తుందన్నారు. వీటిని వినియోగించడం, తగ్గిస్తే మంచి ఆరోగ్యం వంతులుగా తయారవుతారన్నారు. అలాగే చిన్నారులు జింక్ ఫుడ్ , మసాలా దినుసులు, కురుకుర, తదితర జింక్ ఫుడ్ లకు దూరంగా ఉండి చిరుధాన్యాలు వినియోగించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చున్నారు.ఈ సందర్భంగా సిడిపిఓ రెడ్డి రమణమ్మ, ఐ సి డి



ఎస్ సూపర్వైజర్ గంగాదేవి లు మాట్లాడుతూ రోజువారి ఆహారంలో భాగంగా పప్పు ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, పండ్లు, పాలు, వంటి పోషకాలు సమతుల్యంగా ఉండాలని వారు తెలిపారు. అలాగే చిన్నారులకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు ఆహారం ఎలా తయారుచేసి ఎలా వినియోగించు కావాలి అన్న వాటిపై అవగాహన నిర్వహించారు. అలాగే ఇంట్లో లభ్యమయ్యే వ్యర్థ పదార్థాలతో చిన్నారులకు ఉపయోగపడే విధంగా బొమ్మలు ఎలా తయారు చేయాలో చిన్నారుల తల్లిదండ్రులకు డెమో ద్వారా అర్థమయ్య రీతిలో చూపించి అవగాహన నిర్వహించారు. గ్రామంలో అంగన్వాడి కేంద్రాలకు బొమ్మలు, కథలు, పుస్తకాలు, ప్రీస్కూల్ విద్యకు సంబంధించిన మెటీరియల్ తో పాటు, మౌలిక సదుపాయాలు అందజేస్తున్నామన్నారు. అలాగే చిన్నారులు దైవ సేవతో సమానం కావడంతో పలువురు సేవా తత్పరులు అంగన్వాడి కేంద్రాలకు తగిన ప్రోత్సాహకాలు, విరాళాలు అందజేయాలని గ్రామస్తులను వారు కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు రమాదేవి, స్వర్ణ, కృష్ణమ్మ, స్వాతి, సరస్వతి, రామలక్ష్మమ్మ, మంజుల, సునీత,ఐ సి డి ఎస్ సిబ్బంది, ఆయాలు,చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్తులు , తదితరులు పాల్గొన్నారు

## ఎస్ వి జి ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో
# ఘనంగా మహాత్మా బసవేశ్వర జయంతి

**- కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి హర్ష లత**

**కళ్యాణదుర్గం,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** స్థానిక విరక్తిగవి మఠం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళ్యాణదుర్గం లో శ్రీశ్రీశ్రీ మహాత్మా విశ్వ గురు బసవేశ్వర జయంతిని కళాశాల ప్రిన్సిపల్ సిబ్బంది ఘనంగా జరుపుకున్నారు. బసవేశ్వరుడు 12వ శతాబ్దానికి చెందినవారు. వీరు హైందవ మతాన్ని వదిలి ప్రత్యేక ధర్మాన్ని ఏర్పాటు చేశారు. వీరు సమాజంలో కుల వ్యవస్థను వర్ణ భేదాలను లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది, సంఘసంస్కర్త. వీరు 12వ శతాబ్దంలో కర్ణాటక దేశాన్ని పాలించిన బిజ్జల మహారాజు కొలువులో చిన్న ఉద్యోగిగా చేరి ప్రధాన మంత్రిగా పదవి అందుకున్నారు. వీరు మొత్తం 64 లక్షల వచనాలు కూర్చున్నట్టు చరిత్ర చెబుతుంది. ఆనాడు బసవేశ్వరుడు స్థాపించిన అనుభవం అంటపం ఇప్పటి పార్లమెంటు తరహాలో ఉండేది. అక్కడ అన్ని రకాల కులాలు జాతులు తమ సమస్యలు వినిపించేవారు. వీరి ఉపదేశాలు మనుషులందరూ ఒక్కటే కులాలు ఉప కులాలు లేవు.ఆహారము ఇల్లు బట్ట జ్ఞానం వైద్యం ఇవి మానవుని కనీస హక్కులు.శివుడే సత్యం నిత్యం శివుడికి రూపం లేదు.శ్రమను మించిన సౌందర్యం లేదు.భక్తి కన్నా సత్ప్రవర్తనే ముఖ్యం. ఇలా ఎన్నో ప్రవచనాలు చేసి చివరిగా 1196లో కూడల సంగమ అనే పుణ్యక్షేత్రంలో ధ్యాన నిమగ్నోడయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి హర్షలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ కే రవిశంకర్ డాక్టర్ కే శ్రీధర్ , వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి సైలజ రాణి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పి సూర్యనారాయణ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే ధరిత్రి దినోత్సవం సందర్భంగా డాక్టర్ హర్ష లత మాట్లాడుతూ భూమిని కాపాడుకొనే బాధ్యత మరియు పరియవర్ణాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిది అని పోల్లిషన్ కాకుండ చూసుకోవాలి పురుగు మందు



ఎరువులు వాడకుండా పంటలు పండించాలని, ఆవు గంజి పేడ సేంద్రియ ఎరువులు ద్వారా భూమిని కాపాడుకోవాలి వాటి ని ఉపయోగించి పంటలను పండించే విధాలను గురించి తెలిపారు.

# గర్భిణీ మహిళకు నిత్యసురభి ఆధ్వర్యంలో సీమంతం

**అనంతపురం,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** నిత్యసురభి చారటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో చైర్ పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి చేతుల మీదగా గర్భిణీ మహిళలకు సీమంతం చేశారు. శివారు కాలనీలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న శివ భార్య ఈశ్వరి, పెళ్లి జరిగి చాలా ఏళ్ళు అయిన తర్వాత ఈశ్వరి గర్భవతి కావటం ఆ కుటుంబంలో ఎంతో ఆనందాన్ని నింపింది. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న వారి జీవన విధానాన్ని చూసి పుట్టినిల్లు ఆశ్రమంలో సీమంతం చేయాలని నిర్మలమురళి భావించారు. వైశాఖ మాసాన్ని పురస్కరించుకొని బుధవారం ట్రస్ట్ సభ్యుల అందరి సహకారంతో ఆదర్శనగర్ లోని పుట్టినిల్లు ఆశ్రమంలో ఈశ్వరికి సీమంతం చేసి, రెండు నెలలకు సరిపడా 39 రకాల నిత్యవసర సరుకులతో పాటు ఒక బియ్యం ప్యాకెట్ అందించారు. ఈశ్వరి ఎంతో ఆనందంతో సొంత అమ్మలా తనకు సీమంతం చేశారంటూ.. నిర్మలమురళి వద్ద సంతోషం వ్యక్తం చేసింది.. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ.. మహిళగా జన్మించటం ఒక వరమైతే.. తల్లిగా మరో బిడ్డకు జన్మనివ్వడం మహిళ జీవితంలో రెండో వరమని అన్నారు. జన్మనివ్వడం అంటే ఓ మహిళ మరొకరికి పునర్జన్మణి ఇవ్వడం మరువలేనిదన్నారు. ఇవాళ సీమంతం చేసుకుంటున్నా ఈశ్వరిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. ఇలాంటి పేద కుటుంబంలో ఉన్న గర్భవతులకు వీలున్న




వారు సీమంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సన్నబడాలని ఉందా? ఈ సంప్రదాయ పిండితో బరువు తగ్గడం ఎంత ఈజీనో

శరీర బరువు అదుపులో ఉంచుకోవాలని ఆశించేవారికి శుభవార్త! మన సంప్రదాయ భారతీయ ఆహారంలో ఒక అద్భుతమైన పోషకాహారం ఉంది. అదే సత్తు. కేవలం రుచిలో గొప్పదైన ఈ ఆహారం, బరువు తగ్గడానికి కూడా అద్భుతంగా పనిచేస్తుంది. ప్రొటీన్లు, పీచు పదార్థాలు పుష్కలంగా ఉండే సత్తు, మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచుతూనే బరువును నియంత్రించడంలో ఎలా సాయపడుతుందో ఇప్పుడు చూద్దాం. సత్తు, శనగలు లేదా ఇతర పప్పులను ఎండబెట్టి, వేయించి, మెత్తగా చేసిన పిండి. ఇది ప్రొటీన్, ఫైబర్, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం వంటి పోషకాలతో నిండిన సంప్రదాయ భారతీయ సూపర్‌ఫుడ్. బరువు తగ్గాలనుకునేవారికి సత్తు గొప్ప ఎంపిక. ఇది త్వరగా కడుపు నింపుతుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. దీనితో అనవసరమైన చిరుతిళ్లు తగ్గించుకోవచ్చు, బరువు తగ్గించే ఆహారంలో ఇది ఉత్తమమైనది.

**అధిక ప్రొటీన్:**

సత్తులో ఉండే ప్రొటీన్ కండరాల నిర్మాణానికి సాయపడుతుంది, ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుతుంది. దీంతో అనవసరంగా తినడం తగ్గుతుంది, బరువు తగ్గడానికి ఇది కీలకం.

**ఫైబర్ పుష్కలం:**

సత్తులో గల ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, కడుపు ఉబ్బరం, మలబద్ధకం నివారిస్తుంది. ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థ పోషకాలను సరిగా గ్రహిస్తుంది, జీవక్రియ మందగించడం వల్ల వచ్చే బరువు పెరుగుదలను అడ్డుకుంటుంది.

**జీవక్రియను పెంచుతుంది:**

ఐరన్, మెగ్నీషియం, కాల్షియం లాంటి ముఖ్యమైన పోషకాలు సత్తులో ఉంటాయి. ఇవి జీవక్రియ ప్రక్రియలకు మద్దతు ఇస్తాయి. జీవక్రియ పెరిగితే క్యాలరీలు సమర్థంగా ఖర్చువుతాయి, వేగంగా బరువు తగ్గవచ్చు.

**రక్తంలో చక్కెర నియంత్రణ:**

సత్తుకు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంది. అంటే ఇది శక్తిని నెమ్మదిగా విడుదల చేస్తుంది, రక్తంలో చక్కెర అకస్మాత్తుగా పెరగడాన్ని, తగ్గడాన్ని నివారిస్తుంది. స్థిరమైన రక్తంలో చక్కెర ఆకలి బాధలను నియంత్రిస్తుంది, ఎక్కువగా తినే ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**శరీర శుద్ధికి సాయం:**

సత్తు సహజమైన డిటాక్సిఫైయర్‌గా పనిచేస్తుంది, శరీరం నుండి విష పదార్థాలను బయటకు పంపుతుంది. శుభ్రమైన వ్యవస్థ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, జీవక్రియను పెంచుతుంది, వ్యర్థాలను సమర్థంగా తొలగించడం ద్వారా బరువు తగ్గడానికి సాయపడుతుంది.



**తక్కువ క్యాలరీలతో శక్తి:**

అధిక క్యాలరీల ప్రాసెస్ చేసిన ఆహారాలకు భిన్నంగా, సత్తు సహజమైన శక్తి బూస్టర్. ఇది అనవసరమైన కొవ్వులు, చక్కెరలు లేకుండా నిరంతర శక్తిని అందిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి వ్యాయామానికి ముందు లేదా తర్వాత ఇది అద్భుతమైన పానీయం.

**బరువు తగ్గడానికి సత్తును ఐదు మార్గాల్లో తినవచ్చు:**

**సత్తు పానీయం:**

రెండు చెంచాల సత్తును ఒక గ్లాసు నీరు, చిటికెడు ఉప్పు, నిమ్మరసం కలుపాలి. ఈ పానీయం తక్కువ క్యాలరీలతో, ప్రొటీన్‌తో నిండి ఉంటుంది, గంటల తరబడి కడుపు నిండుగా ఉంచుతుంది. ఉదయం దీనిని తాగడం వల్ల జీవక్రియ నియంత్రణలో ఉంటుంది, రోజు మొత్తం ఆకలి తగ్గుతుంది.

**సత్తు మజ్జిగ:**

సత్తును మజ్జిగ, జీలకర్ర పొడి, నల్ల ఉప్పుతో కలిపి తాగాలి. ఇది ప్రొటీన్ నిండిన, జీర్ణక్రియకు అనుకూలమైన పానీయం. మజ్జిగ జీర్ణక్రియకు, గట్ ఆరోగ్యానికి సాయపడుతుంది, సత్తు ప్రొటీన్, ఫైబర్ అందిస్తుంది. సత్తు రోటి లేదా పరాటా: సత్తును గోధుమ పిండితో కలిపి పోషకమైన రోటి లేదా పరాటా చేయాలి. ఈ కలయిక నిరంతర శక్తిని అందిస్తుంది, ఆకలి బాధలను తగ్గిస్తుంది, ఎక్కువగా తినకుండా చేస్తుంది.

**సత్తు లడ్డూ:**


సత్తును బెల్లం, కొద్దిగా నెయ్యి కలిపి లడ్డూలు చేయాలి. ఈ ఆరోగ్యకరమైన శక్తి లడ్డూలు తీపి కోరికలను తీరుస్తాయి, బరువు పెరగకుండా చూస్తాయి. చక్కెర చిరుతిళ్లకు ఇది మంచి ప్రత్యామ్నాయం.

**సత్తు చిల్లా:**

సత్తు, తరిగిన కూరగాయలు, మసాలా దినుసులతో పిండి కలిపి పాన్‌కేక్‌లా కాల్చాలి. ఈ ప్రొటీన్ అధికంగా ఉండే వంటకం తేలికైనది, కడుపు నింపేది. ఇది ముఖ్యమైన పోషకాలను అందిస్తూ క్యాలరీల తీసుకోవడాన్ని నియంత్రిస్తుంది. ఈ వివిధ రూపాల్లో సత్తును రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా బరువు తగ్గించవచ్చు, అదే సమయంలో సరైన పోషణను, శక్తిని పొందవచ్చు.

## వివాహ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి

**పామిడి,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** పామిడి మండలం ఓబుళపురం గ్రామం వైసిపి నాయకుడు మల్లికార్జున కుమారుని వివాహ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షురాలు,గుంతకల్ మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రాంరెడ్డి కూతురు ఎమ్మెల్యే వై.నైరుతిరెడ్డి



మరియు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి,జిల్లా వైసిపి కార్యదర్శి చెన్నకేశవ రెడ్డి, పట్టణ కన్వీనర్ ఈశ్వరరెడ్డి, మరియు సీనియర్ నాయకులు మీసాల రామచంద్ర,చంద్రశేఖర్ రెడ్డి, భయపరెడ్డి, సర్పంచులు దామోదర్ రెడ్డి, వీర, నాగేశ్వర్ రెడ్డి, పుంజా నాగేష్,ఓబులేసు,సూరి, మనోహర్, మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## దాహార్తికి దివ్యౌషధం ముదిగుబ్బ రైల్వే స్టేషన్‌లో చలివేంద్రం ప్రారంభం

**- డాక్టర్ ఎస్.జయ నందన్ రెడ్డి, బాసినేని వెంగమేష్ చౌదరి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**

**- అర్బన్ సీఐ శివరాముడు చేతుల మీదుగా ప్రారంభోత్సవం**






**ముదిగుబ్బ,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** శ్రీ సత్యసాయి జిల్లా, ముదిగుబ్బ మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఉమ్మడి అనంతపురం జిల్లా విశాలాంధ్ర బ్యూరో చీఫ్ డాక్టర్ ఎస్. జయ నందన్ రెడ్డి, మానవ హక్కుల జాతీయ కన్వీనర్ బాసినేని వెంగమేష్ చౌదరి ఆధ్వర్యంలో ప్రత్యేక చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ముదిగుబ్బ అర్బన్ సీఐ శివరాముడు, రైల్వే స్టేషన్ మాస్టర్ నాగభూషణం చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ శివరాముడు మాట్లాడుతూ, ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న వేళ ఉచితంగా చల్లని తాగునీరు అందించడం అభినందనీయమని తెలిపారు. రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు, కూలీలు, వృద్ధులు, చిన్నారులు మరియు సాధారణ ప్రజల కోసం శుభ్రమైన, చల్లని తాగునీటిని అందుబాటులో ఉంచడం వల్ల ఎంతోమందికి ఉపశమనం కలుగుతోందన్నారు. ముఖ్యంగా మధ్యాహ్న వేళల్లో ఈ చలివేంద్రం ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. డాక్టర్ ఎస్. జయ నందన్ రెడ్డి, బాసినేని వెంగమేష్ చౌదరి మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన సమయంలో సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వేసవి కాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. స్థానికులు, ప్రయాణికులు ఈ సేవా కార్యక్రమంపై సంతోషం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరింత కొనసాగించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ నాగభూషణం, పట్టణ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## సబ్ జూనియర్ జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన సత్యసాయి జిల్లా క్రీడాకారులు

**హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షులు, శ్రీ సత్యసాయి జిల్లా జనరల్ సెక్రెటరీ బి.సూర్యప్రకాష్**

**ధర్మవరం,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** సబ్ జూనియర్ జాతీయస్థాయి హాకీ పోటీలకు శ్రీ సత్యసాయి జిల్లా క్రీడాకారులు ఎంపిక కావడం జరిగిందని హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షులు, హాకీ సత్యసాయి జిల్లా జనరల్ సెక్రెటరీ బి. సూర్యప్రకాష్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏప్రిల్ 22వ తేదీ నుండి 28వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్ పట్టణంలో జరుగనున్న జాతీయస్థాయి అస్మిత సబ్



జూనియర్ బాలికల హాకీ ఛాంపియన్ షిప్ లో పాల్గొనే హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు సత్యసాయి జిల్లా ధర్మవరంకు చెందిన మధురిమా బాయి,వైష్ణవి,దివ్య, హర్షిత, శివగంగ ఎంపికైనట్లు వారు తెలిపారు. రాష్ట్ర జట్టుకు ధర్మవరం కు చెందిన సాయికుమార్ కోచ్ వ్యవహరించనున్నారు అని తెలిపారు.రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులను హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్, హాకీ సత్యసాయి జిల్లా జనరల్ సెక్రటరీ బి. సూర్య ప్రకాష్, హాకీ సత్యసాయి జిల్లా గౌరవ అధ్యక్షులు బండి వేణుగోపాల్, పళ్ళెం వేణుగోపాల్, హాకీ సత్యసాయి జిల్లా ప్రెసిడెంట్ బీ.వీ శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ ఉడుముల రామచంద్ర, గౌరీ ప్రసాద్, మహమ్మద్, అస్లాం, ఊకా రాఘవేంద్ర, ట్రెజరర్ అంజన్న, జాయింట్ సెక్రటరీ అరవింద్ గౌడ్, జెన్నే చంద్రశేఖర్, డైరెక్టర్లు మారుతి ప్రసాద్, ఇర్షాద్, అమునొద్దీన్, కిరణ్, సత్యసాయి జిల్లా హాకీ కోచ్ హస్సేన్ అభినందించి, శుభాకాంక్షలు తెలియజేసారు.

## శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే : ప్రిన్సిపాల్ ఫిలిఫ్ కుమార్




**కళ్యాణదుర్గం,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** అనంతపురం జోన్ ఏ జి ఏం సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించడం జరిగింది. ఉపాధ్యాయులతో పాటుగా తల్లిదండ్రులు కూడా ఇంటిదగ్గర శ్రద్ధ వహిస్తే విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించడానికి అవకాశం ఉంటుంది. అని ప్రిన్సిపాల్ తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో యుకేజీ విద్యార్థులు ఒకటవ తరగతికి, ఐదో తరగతి విద్యార్థులు హైస్కూల్ కు ప్రమోట్ చేయడం జరిగింది. ప్రమోట్ చేయబడిన విద్యార్థులకు మెడల్స్ అందజేయడం జరిగింది. విద్యార్థులు చక్కటి నృత్య ప్రదర్శనతో పాఠశాల ప్రాంగణం పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫిలిప్ కుమార్, డీన్ తిప్పారెడ్డి, ఫ్రీ ప్రైమరీ ఇన్చార్జి లీలావతి ప్రైమరీ ఇన్చార్జ్ హేమలత ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది.

## తహసిల్దార్,కార్యాలయం ఎదుట చలివేంద్రం ప్రారంభం

**చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి : తహసిల్దార్ మారుతి ప్రకాష్**




**అమడగూరు,ఏప్రిల్22.అక్షర టైమ్స్:** ఆమడగూరు మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయ ఆవరణంలో బుధవారం, తహసిల్దార్ మారుతి ప్రకాష్, ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. తొలిత చలివేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి చలివేంద్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మారుతి ప్రకాష్, మాట్లాడుతూ వేసవికాలం సందర్భంగా ప్రజలు, తహసిల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు, వృద్ధులు, వికలాంగులు సమస్యలు పరిష్కారం కోసం వచ్చే ప్రజల సౌకర్యం కోసం తాసిల్దార్ కార్యాలయం ఎదుట చలివేంద్రాన్ని ఏర్పాటు చేసామన్నారు. ముఖ్యంగా ఎండలు తీవ్రత దృష్ట్యా తాసిల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యార్థ కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. మండలంలో వివిధ సమస్యల కోసం వచ్చే ప్రజలు వేషవి దృష్ట్యా త్రాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల దాహార్తి కోసం తాసిల్దార్ కార్యాలయం ఎదుటే చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. మండల ప్రజలు, చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తాసిల్దార్ ఏఎస్ మారుతి ప్రకష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ రామకృష్ణారెడ్డి, రెవెన్యూ సిబ్బంది, ఆపరేటర్ మంజునాథ్, శివరాం రెడ్డి, నరేష్ నాయకులు నంజప్ప,తదితరులు పాల్గొన్నారు